# చిత్రవాహిని

ఆ మధ్య నా నవలని సినిమాగా తీయడానికి ఓ నిర్మాత నన్ను మద్రాసు పిలిపించాడు. కథా చర్చలో ఆయన, ఆయన పినమామగారు, ఆయన బావ మరిది, సంభాషణల రచయిత దర్శకుడు అసోసియేట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ నేను కూర్చున్నాం.

"మీ కథలో హీరో చాలా చోట్లకి వెళ్తాడు. మనం సినిమాలో దాన్ని తగ్గించాలి" చెప్పాడు నిర్మాత.

"హీరో చాలా చోట్లకి వెళ్ళాల్సిన అవసరం వుంది కదండి అది తగ్గిస్తే కథ మారిపోతుంగి కదా" అడిగాను.

"లొకేషన్స్ ఎక్కువయితే మాకు ఖర్చు పెరుగుతుంది" సగటున వెయ్యి అడుగులకి ఎంత ఖర్చవుతుందో లెక్కకట్టి చెప్పాడు.

"హీరో ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రదేశాలు తిరిగినట్లు రాస్తే బావుండేది. మీరు వివిధ రాష్ట్రాలు తిరిగినట్లు రాసారు. అన్ని రాష్ట్రాలకి వెళ్ళి షూట్ చేయడం కష్టం చెప్పాడు దర్శకుడు.

"హీరో,హీరోయిన్‌లు మొదటి సారి కలుసుకున్నప్పుడు వాళ్ళ మధ్య చిన్న మిస్ అండర్ స్టాండింగ్ పొట్లాట పెడితే బావుంటుంది" అసోసియేటు డైరెక్టర్.

"కరెక్ట్ నేనూ అదే అనుకున్నాను." చెప్పాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"ఎందుకలా!" అడిగాను నాకు కారణం బోధపడక పోవటంతో

"హీరో, హీరోయిన్ డాక్టర్స్ కాబట్టి మొదటిసారి ఓ మెడికల్ కాన్ఫరెన్స్‌లో పరిచయం అయినట్లు ఆ పరిచయం క్రమంగా ప్రేమలోకి దారితీసినట్లు రాసారు. కాని ఏ బస్‌లోనో సీట్ కోసం దెబ్బలాడుకొన్నట్లో చూపించి, ఆ పరిచయం ప్రేమగా మారిందని చెప్తే బావుంటుంది" సంభాషణల రచయిత చెప్పాడు.

"ఎందుకలా!" అడిగాను మళ్ళీ

"హీరో హీరోయిన్స్ మొదట పోట్లాడుకుని తర్వాత ప్రేమలో పడటం ఆడియన్స్‌కి నచ్చే ఫార్ములా"

"కాని మన వాళ్ళిద్దరు బాగా చదువుకున్నవారు వాళ్ళ కేరక్టర్సే వేరు. హీరోకి కారుండగా బస్‌లో వెళ్ళాడు"

"సర్లెండి అది మేం చూసుకుంటాలెండి" నా వాదన నచ్చని దర్శకుడు చెప్పాడు.

"సిల్క్ స్మిత డేన్స్ నా సినిమాలన్నిటిలో మస్ట్. ఆపరేషన్ చేసాక విశ్రాంతి కోసం డాక్టర్ ఓ నైట్‌క్లబ్‌కి వెళ్ళినట్లు పెట్టుకుంటే ఓ డిస్కో డేన్స్ లాగించవచ్చు" చెప్పాడు నిర్మాత.

"నా హీరో సిల్క్ స్మిత డేన్సున్న సినిమాకే వెళ్ళడనే ఇంప్రెషన్ వచ్చేలా రాసాను. సాఫిస్టికేటెడ్ కేరక్టర్ కదా. అది బావుండదు" అడ్డుపడ్డాను.

"మన సినిమా సాఫిస్టికేటెడ్ ఆడియన్స్ మాత్రమే చూడరు. బి. సి లలో కూడా ఆడాలి కదా"

బి. సి లేంటో నేను అడగదలచుకోలేదు.

"హీరో, హీరోయిన్ డాక్టర్స్ కాబట్టి క్లయిమేక్స్‌లో హీరోయిన్ ప్రమాదకర పరిసితులో హాస్పిటల్‌లో చేరింది. హీరో ఓ పక్క తన రక్తం ఇస్తూ, ఆమెకి ఆపరేషన్ చేస్తాడు. రీరికార్డింగ్‌లో జాగ్రత్త పడితే అదిరి పోతుంది" చెప్పాడు నిర్మాత పిన మామగారు.

"అలాంటివి చాలా సినిమాల్లో వచ్చేసాయి కదండీ" నిరుత్సాహంగా చెప్పాను.

"అయినా జనం చూస్తారు."

"పోనీ ఫిజికల్ క్లయిమక్స్ పెట్టుకుందాం. హీరోయిన్ బ్రిడ్జిమీద పరిగెడుతుంటే ఎదురుగా రైలొస్తుంటే హీరోయిన్‌ని రక్షించడానికి హీరో వస్తాడు" నిర్మాత పినమామగారి వంక నిరసనగా చూసి చెప్పాను.

"నా నవలలోని పాత్రలలా ప్రవర్తించవండి, హైయ్యర్ మిడిల్ క్లాస్‌కి చెందిన, సంస్కారం, విద్య వున్న పాత్రలవి. భార్య మీద అనుమానం వస్తే సామరస్యంగా విడిపోయే స్వభావం హీరోది. ఆత్మహత్య చేసుకునే పిరికిది కాదు నవల్లో హీరోయిన్.

"చూడండి మాస్టారు. కొన్ని కొన్ని సన్నివేశాలు థ్రిల్స్ కోసం, మాబ్ కోసం సినిమాలో తప్పనిసరిగా వుండాలి" చెప్పాడు దర్శకుడు.

"ఇంకా ఏం వుంటే బావుంటుంది" అడిగాను.

"లాస్ట్‌లో కుంగ్‌ఫూ ఫైట్ ఒకటి వుండాలి. మొదట్లోనే హీరో ఇంట్రడక్షన్‌లో కుంగ్‌ఫు నేర్చుకుంటున్నాడని చూపిద్దాం. ఈ సంవత్సరంలో హిట్ అయిన అన్నిటిలో కుంగ్‌ఫు ఫైట్లున్నాయి" అసిస్టెంట్ డైరెక్టర్.

"ఎవరితో పోట్లాడతాడు హీరో" కోపంగా అడిగాను.

దొంగతనంగా మందులమ్ముకునే కాంపౌండర్ పాత్ర ఒకటి అనుకున్నాం. వాడు అసలు విలన్. లాస్ట్‌లో డాక్టర్ రియలైజ్ అయి....

"నా నవల్లో విలన్ కేవలం విధే. అలాంటి కాంపౌండర్ పాత్ర లేనే లేదు"

"నవలకి, సినిమాకి చాలా తేడా వుంది మాస్టారు. మీరు రాసుకొన్నట్లు తీస్తే డల్‌గా వుంటుంది".

"డల్‌గా వుంటే నా పాఠకులు దాన్ని ఎందుకు కొంటున్నారు. అది హిట్ సీరియల్ ఎలా అయింది!" కోపంగా అడిగాను.

"మీరున్న ఫాలోయింగ్ నవలగా అది బాగా లేదనట్లేదు మేం" అసోసియేట్ డైరెక్టర్.

సంభాషణల రచయిత నవలలో లేని హాస్యపు ట్రేక్ చెప్పాడు. తనకిరోగం ఉందనుకుని భయపడే ఆరోగ్యవంతుడయిన రోగి, అతని రోగిష్టి భార్య.... వెల్డింగ్ చేసి కథలో అతికించాడు.

రైట్స్ అమ్మేస్తాను. సినిమా తీసారు విడుదలయింది. యేవరేజ్‌గా పోయింది. నవలలని సినిమాలుగా తీసే ట్రెండ్ మొదలవటం వల్ల చాలా మంది నవలలు సినిమాలుగా వచ్చాయి. ఏ ఒక్క చిత్రంలో నవలలోని కథ యధాతధంగా లేదు. చాలా మంది పైత్యం ఉంది. బూతు డైలాగ్స్ ఉన్నాయి. ఫైట్స్ ఉన్నాయి. సిల్క్ స్మిత లున్నారు. ఫిజికల్ క్లయిమాక్సులున్నాయి.

రెండేళ్ళ తర్వాత కొన్ని కారణాలవల్ల నా నవలకి 'కొత్త వెలుగు'గా పేరు మార్చి ముద్రించారు పబ్లిషర్స్. ఓరోజు కాలింగ్ బెల్ మోగితే తలుపులు తెరిచాను.

ఎదురుగా నిర్మాత, అతని పినమామగారు.

"మీ కొత్తవెలుగు నవలని సినిమాగా తీద్దాం అనుకొంటున్నాం" చెప్పాడు నిర్మాత కూర్చుంటూ.